క్లుప్తంగా

స్వతంత్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆవిర్భావం



వంశీకి నియామక పత్రం అందిస్తున్న ఆనంద్‌కుమార్

సీటీఆర్ఐ: విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కుల సాధనకు స్వతంత్ర జనతా పార్టీ(రిపబ్లిక్) అనుబంధ విద్యార్థి సంఘం ఏర్పాటు చేసినట్టు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్రే ఆనంద్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో సంఘ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన గుదే వంశీకి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టూడెంట్స్ ఫెడరేషన్(ఎస్ఎస్ఎఫ్) కూడా ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. దేశ మనుగడను నిర్దేశించే విద్యా వ్యవస్థను వ్యాపారంగా మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుదే వంశీ మాట్లాడుతూ, జిల్లాలో విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా వారికి అండగా నిలబడి, వారి సమస్యల పరిష్కారానికి పాటుపడతామన్నారు.

వైఎస్సార్ సీపీ నేత బాజీకి చందన పరామర్శ



బాజీకి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి, కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు, కొంతమూరు గ్రామానికి చెందిన షేక్ బాజీని శుక్రవారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఈ సందర్భంగా చందన ఆయనకు రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పార్టీ నాయకులు చెరుకూరి సత్యనారాయణ, ఎంఎం ఆలీ, జాకిర్ హుస్సేన్, ముజ్జు ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేమగిరిలో నేడు 'గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్



ర్యాలీ నిర్వహిస్తున్న అభిమానులు

కడియం: గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా నటించిన గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ వేమగిరిలో శనివారం సాయంత్రం జరగనుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు, రామ్‌చరణ్, చిత్ర దర్శకుడు శంకర్, నిర్మాత దిల్ రాజు, చిత్ర నటీనటులు హాజరు కానున్నారు. కార్యక్రమ ఏర్పాట్లు జీ మీడియా చైర్మన్ నరేంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈవెంట్ ఏర్పాట్లను శుక్రవారం అఖిల భారత చిరంజీవి యువత ప్రతినిధులు పరిశీలించారు. జిల్లా ఎస్పీ సూచనల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నరేంద్ర తెలిపారు. అభిమానుల కోసం ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కాగా: ఈవెంట్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ డి.నరసింహ కిషోర్ పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గేమ్‌ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ విజయవంతం కావాలని కోరుతూ అభిమానులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. కోటగుమ్మం సెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది.

సినిమాలు



శ్యామల	: మ్యాక్స్
సూర్య మినీ	: ముఫాసా
సూర్య ప్యాలెస్	: యుఐ, క్రావెన్
శివజ్యోతి	: పుష్ప–2
అనుశ్రీ	: మార్కో
రాజా	: పుష్ప–2
ఊర్వశి	: క్రావెన్
మేనక	: ఆటోరంగ, చేతిలో చెయ్యేసి చెప్పు బావ
రంభ	: బచ్చల మల్లి
కుమారి	: రఘువరన్ బీటెక్
అప్సర	: పుష్ప–2
అశోక	: మార్కో
నామవరం	
వీఎస్ మహల్	: పుష్ప–2, ట్రావెల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: పుష్ప–2
కడియం	
వెంకటసూర్య	: మార్కో, పుష్ప–2

మునుల క్షేత్రం మురమండ



దాత సహకారంతో అభివృద్ధి చెందిన ఆలయం



ఆలయ పరిసరాల్లో పచ్చదనం



మురమండలోని సర్వకామదాంబ సమేత సోమేశ్వర స్వామివారు

- సోమేశ్వరాలయంలో అభివృద్ధి పనులు పూర్తి
- రూ.లక్షలు వెచ్చించిన ఎన్నారై వెంకట్రావు, సత్యదుర్గావాణి దంపతులు
- 6న శాంతి కల్యాణం, ప్రత్యేక పూజలు

కడియం: వందల ఏళ్ల చరిత్ర కలిగిన మండలంలోని మురమండలో ఉన్న సర్వకామదాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేశారు. గ్రామానికి చెందిన ఎన్నారై మద్దుల వెంకట్రావు, సత్యదుర్గావాణి దంపతులు లక్షలాది రూపాయలు వెచ్చించి ఈ పనులు చేయించారు. ఈ పనులకు దాదాపు ఏడాదికి పైగా సమయం పట్టిందని గ్రామస్తులు తెలిపారు. ప్రధాన ఆలయానికి గ్రానైట్, ఆవరణలో నాపరాళ్లు, ప్లబింగ్, ఎలక్ట్రికల్ పనులతో పాటు, ఆలయ ఆవరణలో 27 నక్షత్రాలకు సంబంధించిన వృక్షాలను కూడా నాటారు. అలాగే ఆలయ పరిసరాలు మొత్తం పచ్చని మొక్కలతో తీర్చిదిద్దారు. దీంతో పురాతన ఆలయం కాస్తా ఆధునిక రూపును సంతరించుకుంది.

6న ప్రత్యేక పూజలు

ఆలయంలో అభివృద్ధి పనుల నేపథ్యంలో జనవరి 6వ తేదీన శాంతి హోమం, పంచ సహస్రపార్థివ లింగార్చన, శాంతి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త దామెర్ల రవిబాబు, ఆలయ అర్చకులు బాదంపూడి బుచ్చివెంకట సోమేశ్వర గురుకుల్, దేవదాయ శాఖ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు శివలింగ ప్రసాదాన్ని అందజేయనున్నారు. పుట్టమట్టి, ఆవు పంచకం, గోమయం, పసుపు, ఆవు నెయ్యితో శివలింగాలను తయారు చేశారు. ఇందుకోసం గ్రామానికి చెందిన మహిళలు కొద్ది రోజులుగా నియమనిష్టలతో శివలింగాలను రూపొందించారు. ఆరో తేదీన నిర్వహించే పూజా కార్యక్రమాల అనంతరం వీటిని భక్తులకు అందజేయనున్నట్లు అర్చకులు తెలిపారు. సంక్రాంతి ముందు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి గ్రామంతో పాటు, చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు హాజరవుతారని అంచనా. ఈ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణలు, హోమం, ప్రత్యేక పూజలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.



ప్రత్యేక పూజలకు శివలింగాలను సిద్ధం చేస్తున్న భక్తులు



దాత మద్దుల వెంకట్రావు కుటుంబ సభ్యులు

ఇదీ ఆలయ చరిత్ర

దాదాపు నాలుగు వందల ఏళ్ల క్రితం మునులు మందలుగా తపస్సు ఆచరించిన ప్రదేశమే ప్రస్తుతం సోమేశ్వరాలయం ఉన్న ప్రాంతంగా పూర్వీకులు చెబుతారు. కాలక్రమంలో మునిమంద గ్రామమే మురమండగా రూపాంతరం చెందింది. ఇక్కడ తపస్సు ఆచరించే మునుల పూజలు అందుకున్న శివలింగంగా సోమేశ్వరలింగం ప్రసిద్ధి పొందింది. ఆలయానికి సమీపంలోనే ఉన్న కోనేరులో స్నానాలు ఆచరించి, మునులు ఇక్కడ పూజాదికాలు నిర్వహించేవారని పూర్వీకుల ద్వారా తెలుస్తోందని ఆలయ అర్చకులు సోమేశ్వర గురుకుల్ తెలిపారు. పిఠాపురం సంస్థానం ఆధీనంలోని ఈ ఆలయానికి వంశ పారంపర్య ధర్మకర్తలుగా ప్రస్తుతం దామెర్ల రవిబాబు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికీ ఆలయ రథోత్సవం సందర్భంగా ధర్మకర్తల కుటుంబీకులు హాజరై, రథయాత్రను ప్రారంభిస్తారని అర్చకులు వివరించారు. పండగలు, ఇతర ముఖ్య తిథుల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి.

దాతల సాయంతో అభివృద్ధి



దాత వెంకటరావు దంపతుల సాయంతో ఆలయంలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. ఈ నెల ఆరున శాంతి కల్యాణం, అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. భక్తులు స్వయంగా ఐదు వేల శివలింగాలు మట్టితో తయారుచేశారు. వీటిని పూజలో వినియోగిస్తాం.

– సోమేశ్వర్ గురుకుల్, ఆలయ అర్చకుడు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: బాలాజీపేట సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ లైన్లలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. నేతాజీనగర్–1 నుంచి 15వ వీధి వరకు, జేఎల్‌బీ నగర్, కేవీఆర్ నగర్, కోహినూర్ అపార్ట్‌మెంట్ ,గురుకులం రోడ్, సెయింట్స్ స్కూల్ ఏరియా, ఏసీబీ కాలనీ, నవ భారత్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

సైన్స్‌ఫెయిర్‌కు ఏర్పాట్లు పూర్తి

డీఎస్ఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: శ్రీసత్యసాయి గురుకులంలో శనివారం జరిగే సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్ ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించే జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తయ్యాయని డీఎస్ఈవో కె.వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు నిర్వాహక కమిటీలతో శుక్రవారం గురుకులంలో సమీక్ష నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రదర్శన మొదలవుతుందని విద్యార్థులు తమ ఎగ్జిబిట్ల వద్ద ఉండాలని ఆదేశించారు. ప్రదర్శనకు హాజరయ్యే ఉపాధ్యాయులు, విద్యార్థులకు అల్పాహారం, భోజన సదుపాయాలు కల్పించామన్నారు.

రాత పరీక్ష వాయిదా

కంబాలచెరువు: రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు ఈఏఆర్ ఎయిడెడ్ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూళ్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఈ నెల 9న నిర్వహించాల్సిన ఉపాధ్యాయ అర్హత రాత పరీక్ష వాయిదా వేసినట్టు డీఈవో వాసుదేవరావు తెలిపారు. ఈ పరీక్ష ఎప్పుడు నిర్వహించేది కరెస్పాండెంట్ ద్వారా తెలియజేస్తామని చెప్పారు.

హడావుడి చర్యలు.. నాణ్యతకు తిలోదకాలు

- నగరంలో రూ.85 లక్షలతో గుంతలు పూడ్చే కార్యక్రమం
- 614 పనుల గుర్తింపు
- పూడ్చివేత చేపట్టినవి 365

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. గుంతలు లేని రహదారులు నిర్మిస్తామంటూ కూటమి పాలకులు చేపట్టిన నిర్మాణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజమహేంద్రవరం నగరంలో 50 డివిజన్లలోని 95 సచివాలయాల పరిధిలో 614 చోట్ల రహదారాల్లో గుంతలను నగరపాలక సంస్థ అధికారులు గుర్తించారు. వీటి మరమ్మతులకు నగరపాలక సంస్థ రూ.85 లక్షలకు అంచనా వేసింది. ఈ మేరకు గతేడాది నవంబర్ రెండో తేదీన నగరంలో గుంతలు పూడ్చే కార్యక్రమానికి కూటమికి చెందిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కంబాల చెరువు సెంటర్‌లో శ్రీకారం చుట్టారు. గుంతలు పూడ్చాలన్న హడావుడి మినహా.. పనుల్లో ఎంతమాత్రం నాణ్యత లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. రోడ్లకు మరమ్మతులు పూర్తి చేసిన వెనువెంటనే రహదారిలో రాళ్లు తేలిపోతున్నాయని చెబుతున్నారు. ఏమాత్రం చిన్నపాటి వర్షం కురిసినా మరమ్మతులు చేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమయ్యే పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఇప్పటి వరకు 365 మరమ్మతు పనులు పూర్తి చేయగా, 249 గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టాల్సి ఉంది.



జాంపేటలో కొత్తగా నిర్మించిన రోడ్డుపై తేలిన రాళ్లు

అధికారుల పర్యవేక్షణ ఉండాలి

నగరంలో వర్షాల కారణంగా గుంతలు పడ్డ రహదారులను హడావుడిగా మరమ్మతులు చేపట్టడం వల్ల కొద్ది రోజులకే మళ్లీ గోతులు పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో అధికారులు పర్యవేక్షణతో, నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు చేపట్టాల్సి ఉందంటున్నారు. నిర్మించిన రోడ్లపై రాళ్లు తేలిపోతుండటంతో నాణ్యత ప్రమాణాలపై నగర ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల మరమ్మతులను పూర్తి స్థాయిలో పారదర్శకంగా చేపట్టాలని కోరుతున్నారు.

ప్రపంచానికే సావిత్రీబాయి ఆదర్శం

సీటీఆర్ఐ: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే ఆశయాలు కొనసాగించాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సానబోయిన రామారావు అన్నారు. సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నెహ్రూనగర్ కార్పొరేషన్ హైస్కూలులో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయిలను ఘనంగా సత్కరించారు. రిటైర్డ్ ఆదాయపు పన్ను శాఖ అధికారి మేడిశెట్టి తిరుమలకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్ ఎల్వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు డి.జార్జిఆంథోని, సభ్యులు మట్టపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో..

సావిత్రీబాయి పూలే గొప్ప మహిళా మూర్తి అని, ఆమె ప్రపంచానికే ఆదర్శమని ఉభయ రాష్ట్రాల బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ, మహాత్మా జ్యోతీరావు పూలే తన భార్యకు విద్యను నేర్పించారని, సావిత్రీబాయి పూలే దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి అప్పారావు, సంకిశ భవాని ప్రియ, అనంతలక్ష్మి, గణేష్, కట్ట వెంకటేష్, అను యాదవ్, కృష్ణవేణి, సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ కళాశాలలో..

స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహ/ంచారు. ప్రిన్సిపాల్ రమణమూర్తి అధ్యక్షత వహించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఆమెకు నివాళులర్పించారు. స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవకుమారి ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



కస్తూర్బా గాంధీ స్త్రీల వృద్ధాశ్రమంలో..

కస్తూర్బా గాంధీ వృద్ధాశ్రమంలో..

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా గాంధీ స్త్రీల వృద్ధాశ్రమంలో సావిత్రీబాయి పూలే జయంతి జరిగింది. వృద్ధాశ్రమంలోని మహిళలకు దుప్పట్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్లేపల్లి సుభాషిణి, వినయకుమారి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అరుణకుమారికి పురస్కారం

రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ నక్కెళ్ల అరుణకుమారికి సావిత్రీబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం వరించింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సినీ హాస్య నటుడు డాక్టర్ బ్రహ్మానందం చేతులమీదుగా అరుణకుమారి ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

హెచ్ఎం మంగారాణికి అవార్డు

కంబాలచెరువు: స్థానిక నాగరాజా నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సినీ నటి రేణు దేశాయ్ చేతుల మీదుగా సావిత్రీబాయి పూలే అవార్డు అందుకున్నారు. మహిళా సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె విగ్రహానికి కళాశాల ప్రిన్సిపాల్, అతిథులు నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ, ఆమె సమాజానికి విశిష్ట సేవలను అదించారని కొనియాడారు. ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ ఆశ్లేష, బోధి స్కూల్ ప్రిన్సిపాల్ నిషా రామచంద్రన్, నిడదవోలు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కే జ్యోతిని బెస్ట్ ఎంపవర్డ్ ఉమెన్ టీచర్ పురస్కారంతో సత్కరించారు.



ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న సభ్యులు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు సంతోష్‌నగర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నరసమాంబకు విజయవాడలో ఓ కార్యక్రమంలో సినీనటి రేణు దేశాయ్ సావిత్రీబాయి పూలే అవార్డు అందజేశారు. హాస్య నటుడు బ్రహ్మానందం పాల్గొన్నారు.

కడియం: వేమగిరితోట–1 ప్రాథమిక పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు యాతం నాగమణిని మండల విద్యా శాఖాధికారులు ఎంఎస్ మణికుమార్, వై.నాగేశ్వరరావు, సర్వశిక్షా అసిస్టెంట్ ఇంజినీర్ వీరభద్రరావు, హెచ్ఎం కె.జయరాజు ఘనంగా సత్కరించారు.

నర్సరీ సందర్శించిన ఫారెస్టు అకాడమీ బృందం



నర్సరీని సందర్శించిన ఫారెస్టు అకాడమీ బృందం

కడియం: కడియపులంకలోని శ్రీసత్యదేవ నర్సరీని శుక్రవారం తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ డీడీ సాగర్, రాజమండ్రి ఫారెస్ట్ హెడ్ ఆనందరావుతో కలిసి 40 మంది 26వ బ్యాచ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సందర్శించారు. ఈ సందర్భంగా డీడీ సాగర్ మాట్లాడుతూ, దేశ విదేశీ ఉద్యానవన సంపద ఒకేచోట నిక్షిప్తమైన ఏకైక ప్రదేశం కడియం ప్రాంతమన్నారు. ఇక్కడ ఉన్న, కొన్ని వేల రకాల మొక్క జాతులు, వాటి శాస్త్రీయ నామాలను క్షుణ్ణంగా తెలుసుకోవచ్చన్నారు. ఉద్యానవన శిక్షకులకు, తెలంగాణ అటవీ శాఖ అక్కడి అడవులను అభివృద్ధి చేయడం కోసం ఈ ప్రదేశాలు మేలు చేస్తాయని తెలిపారు. అందుకే తమ విజ్ఞాన పర్యటనల్లో తప్పనిసరిగా కడియం ప్రాంతాన్ని ఎప్పుడూ ఎంచుకుంటారని చెప్పారు. నర్సరీలో ఉత్పత్తి అయ్యే కొన్ని రకాల మొక్కల వివరాలను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లా పెద్ద సత్యనారాయణని అడిగి తెలుసుకున్నారు.

సీఎం దృష్టికి కార్మికుల సమస్య

సీటీఆర్ఐ: రాజమండ్రి పేపరుమిల్లు కార్మికుల సమస్యను మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు, పలువురు ఎంపీ, ఎమ్మెల్యేల బృందం శుక్రవారం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లింది. 2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందంతో పాటు, పలు అంశాలపై చర్చించారు. త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యేల బృందం వెల్లడించింది. తాడేపల్లిలో సీఎంను కలిసిన వారిలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ ఉన్నారు.

మాస్టర్స్ టోర్నీ రన్నరప్‌గా సీటీఆర్ఐ శాస్త్రవేత్త



డా.సుమన్ కల్యాణిని అభినందిస్తున్న సీనియర్ సభ్యులు

ఆల్కాట్‌తోట(రాజమహేంద్రవరం రూరల్): విజయవాడ ఫన్‌టైం క్లబ్ గత నెల 29న నిర్వహించిన ఏపీ స్టేట్ లెవెల్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో సీటీఆర్ఐ శాస్త్రవేత్త, ఆఫీసర్స్ క్లబ్ క్రీడాకారిణి డా.కె.సుమన్ కల్యాణి 50ప్లస్ విభాగంలో రన్నరప్‌గా నిలిచారు. శుక్రవారం ఆఫీసర్స్ క్లబ్‌లో సీనియర్ సభ్యులు ఏవీ.వెంకటరాజు, వి.గోపాలకృష్ణ తదితరులు ఆమెను అభినందించారు. రాష్ట్రస్థాయి వెటరన్ టీటీ విభాగంలో 50ప్లస్ కేటగిరిలో ట్రోఫీని ఆమె కైవసం చేసుకున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సాజిద్

ధవళేశ్వరం: రాజమహేంద్రవరం రూరల్ మూడో మండల బీజేపీ అధ్యక్షుడిగా ధవళేశ్వరం గ్రామానికి చెందిన షేక్ సాజిద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో ఉన్న పార్టీ బూత్ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యుల ఏకాభిప్రాయంతో శుక్రవారం ఆయనను ఎన్నుకున్నారు., మండలంలో ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తానని సాజిద్ చెప్పారు.

వేదాధ్యయన సమన్వయకర్తల నియామకం

రాజమహేంద్రవరం రూరల్: శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా వేదాధ్యయన సమన్వయకర్తలుగా కోటపాడుకు చెందిన కందర్పసాయి సుబ్రహ్మణ్య శ్రీరాం శర్మను, రాజమహేంద్రవరం దానవాయిపేటకు చెందిన కల్లూరి గాయత్రిదేవిని నియమించారు. అలాగే జిల్లా ఐటీ ఇన్చార్జిగా కోటపాడుకు చెందిన పోతుల ఈశ్వరరావు నియమితులయ్యారు. రెండేళ్ల పాటు వీరు కొనసాగుతారని జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు తెలిపారు.

వైభవంగా దీపోత్సవం



ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

కడియం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని దుళ్లలో ఉన్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద శుక్రవారం తెల్లవారుజామున దీపోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దఎత్తున భక్తులు పాల్గొని, దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఆప్కో వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సంక్రాంతి సందర్భంగా ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు సంస్థ రాజమండ్రి మండల వాణిజ్య అధికారి బి.హరిప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆప్కో విక్రయశాలల్లో ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 50 శాతం డిస్కౌంట్ ఉన్నట్లు చెప్పారు. లాలాచెరువు, రాజమండ్రిలోని హ్యాండ్‌లూమ్ హౌస్, జెండా పంజా రోడ్, శివజ్యోతి థియేటర్ వద్ద ఆప్కో విక్రయశాలల్లో ఆయా ఆఫర్లు అందిస్తున్నట్లు వివరించారు. రాజమండ్రి, బందరు, వెంకటగిరి, మాధవరం, చీరాల, ఉప్పాడ చీరలు, షర్టింగ్, ధోవతులు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్ తదితర చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలని కోరారు. చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించి, చేనేత కార్మికులను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.